ప్రజారోగ్యంతో చెలగాటం

- మార్కెట్‌ను ముంచెత్తుతున్న నాణ్యత లేని తినుబండారాలు
- చిన్నారుల్లో తీవ్రమవుతున్న ఆరోగ్య సమస్యలు
- కొరవడిన తూనికలు, కొలతల శాఖ, ఫుడ్‌సేఫ్టీ, అధికారులు తనిఖీలు

➤ కావలి పట్టణంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన ఏడేళ్ల చిన్నారికి ఆకలి తగ్గిపోవడంతో పాటు తరచూ కడుపునొప్పితో బాధపడుతుండగా తల్లిదండ్రులు పట్టణంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చిన్నారిని పరీక్షించిన వైద్యుడు అజీర్తి, పోషకాహారలోపం, నులిపురుగుల సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆహారపు అలవాట్లపై ఆరా తీశారు. పాఠశాలకు వెళ్లే ముందు, వచ్చిన తరువాత ఐదు రూపాయల ప్యాకెట్లలోని చిప్స్ ఎక్కువగా తింటాడని తల్లిదండ్రులు చెప్పగా వైద్యుడు మందలించాడు. చిప్స్‌లో వినియోగించే ఆయిల్, ఇతర కెమికల్స్ కారణంగా చిన్నారిలో అజీర్తి సమస్య రావడంతో పాటు అపరిశుభ్ర వాతావరణంలో తయారు చేయడం వల్ల నులిపురుగుల సమస్య తీవ్రమైనట్లు చెప్పారు. చిప్స్‌ను కట్టడి చేయాలని సూచించారు.

➤ కావలి పట్టణంలోని బంధువుల ఇంటికి సంక్రాంతి పండగకు హైదరాబాద్‌లో స్థిరపడిన ఓ కుటుంబం వచ్చింది. ఆ కుటుంబానికి చెందిన పిల్లలకు జంక్‌ఫుడ్ ప్యాకెట్లు కొనుగోలు చేసి తినడం అలవాటు. కావలిలోని ఓ షాపులో చిప్స్ ప్యాకెట్లు కొనుగోలు చేసి తినేందుకు తెరవగా పూర్తిగా పాడైపోయి ఉన్నాయి. ఈ విషయం తెలియని చిన్నారులు వాటిని నోటికి పట్టించే ప్రయత్నం చేస్తుండగా షాపు వద్ద ఉన్న వారు గమనించి తినొద్దని సూచించారు. దీంతో షాపు యజమాని వాటిని పడేయాలని పిల్లలకు చెప్పి, నగదును తిరిగి ఇచ్చేసి మరోచోట తీసుకోమని చెప్పి పంపాడు.


కావలిలోని ఓ హోల్‌సేల్ దుకాణంలో విక్రయిస్తున్న నాణ్యత లేని జంక్‌ఫుడ్ ప్యాకెట్లు

ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

చిప్స్ వల్ల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. చిప్స్ తయారీలో నూనె, ఉప్పు అధికంగా వినియోగిస్తారు. వీటి వల్ల గుండె జబ్బుల సమస్య పెరుగుతుందని చెబుతున్నారు. వీటిలో ఉండే ట్రాన్స్ ఫ్యాట్ అనే పదార్థం శరీరంలో చెడు కొవ్వును పెంచుతుంది. తద్వారా గుండెకు రక్త సరఫరా సరిగ్గా జరగ్గా గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. చిప్స్‌లో ఉండే అక్రిలమైడ్ అనే రసాయంతో కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందని సూచిస్తున్నారు చిప్స్‌లో కొవ్వు శాతం ఎక్కువగా ఉంటుంది. ఇవి తింటే జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కొన్ని సార్లు కడుపు నొప్పి, గ్యాస్, ఎసిడిటీ వంటి జీర్ణ సమస్యలు తలెత్తుతాయని నిపుణులు చెబుతున్నారు. రోగ నిరోధక శక్తిపైనా తీవ్ర ప్రభావం చూపి వ్యాధుల ముప్పు పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

కావలి: ఈ రోజుల్లో చాలామందిలో ఆరోగ్య స్పృహ పెరుగుతోంది. భోజనంలో ఆరోగ్యకరమైన పదార్థాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే తినుబండారాలను మాత్రం మనకు నచ్చినవి తినేద్దాంలే అన్న అలసత్వం చాలా మందిలో కనిపిస్తోంది. ఈ బలహీనతనే తినుబండారాలు తయారు చేసే కంపెనీలు సొమ్ము చేసుకుంటున్నాయి. నాణ్యత లేని వాటిని విక్రయిస్తున్నాయి. సాధారణంగా వినియోగదారులు చిన్న ప్యాకెట్లనే కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపతారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తినుబండారాలు తయారు చేసే కంపెనీలు తక్కువ ధరతో చిన్న పరిమాణంలో తమ ఉత్పత్తుల ప్యాకెట్‌లను విక్రయిస్తున్నాయి. ఈ క్రమంలో ప్యాకెట్ల ధరలు పెంచకుండా వాటిలో తినుబండారాల పరిమాణాన్ని, నాణ్యతను తగ్గిస్తున్నాయి. ప్రధానంగా చిన్నారులను లక్ష్యంగా చేసుకుని నాణ్యతలేని జంక్‌ఫుడ్ ప్యాకెట్లను విచ్చల విడిగా విక్రయిస్తున్నాయి.

నిత్యం లక్షల్లో వ్యాపారం

పట్టణంతో పాటు చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లోని చిన్నచిన్న దుకాణాలతో పాటు పెద్ద షాపుల్లోనూ రంగురంగుల ప్యాకెట్లలోని జంక్‌ఫుడ్‌ను తోరణాల్లా వేలాడ దీసి అమ్మకాలు చేస్తున్నారు. అందుకు సంబంధించి కావలిలో స్టాకిస్టులతో పాటు హోల్‌సేల్ దుకాణాలు ఉన్నాయి. విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, చెన్నై, తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుని విక్రయాలు చేస్తున్నారు. కావలి మార్కెట్ నుంచి నిత్యం లక్షకుపైగా తినుబండారాలు ప్యాకెట్లు అమ్మకాలు జరుగుతున్నాయి. కావలి మార్కెట్ నుంచి ఉదయగిరి, కందుకూరు, కావలి నియోజకవర్గాల్లోని వందల సంఖ్యలో ఉన్న చిరు దుకాణాలకు తినుబండారాల ప్యాకెట్లు తరలిపోతుంటాయి. నిత్యం లక్షలాది రూపాయల వ్యాపారం జరుగుతోంది.

చిన్నపిల్లలే లక్ష్యంగా..

కొన్ని కంపెనీలు చిన్నపిల్లలనే లక్ష్యంగా చేసుకుని జంక్‌ఫుడ్ ప్యాకెట్లపై చిన్నారులకు ఇష్టమైన సూపర్ హీరోలు, స్పైడర్ మ్యాన్, ఐరన్‌మ్యాన్, హల్క్, తదితర బొమ్మలను ముద్రించి వారిని ఆకర్షిస్తున్నాయి. అలాగే చిన్నచిన్న ప్లాస్టిక్ బొమ్మలను కూడా గిఫ్ట్ పేరుతో ఉచితంగా ఇస్తుండటంతో వాటి కోసం చిన్నారులు మారం చేస్తున్నారు. గతంలో జంక్‌ఫుడ్ ప్యాకెట్‌లో వచ్చిన బొమ్మ గొంతులో ఇరుక్కుని ఓ చిన్నారి మృతి చెందిన ఘటనలు తెలుగు రాష్ట్రాల్లో చోటు చేసుకుని ఉన్నాయి. చిన్నారులను దృష్టిలో ఉంచుకుని జంక్‌ఫుడ్ ప్యాకెట్లను తయారు చేస్తున్న కంపెనీలు కనీస నాణ్యత ప్రమాణాలను పాటించడం లేదు. దీంతో చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ఆకలి మందగించడం, కడుపునొప్పి, తదితర సమస్యలు ఎక్కువవుతున్నాయని వైద్యులు చెబుతున్నారు.

కొరవడిన కట్టడి

జంక్‌ఫుడ్ తయారు చేసే కంపెనీలు నిబంధలు పాటించడం లేదు. నిబంధనల ప్రకారం ప్రతి ప్యాకింగ్‌పై తయారీదారు చిరునామా, తయారీ, గడువు తేదీలు, ఫోన్ నంబర్, కస్టమర్ కేర్ నంబర్లను ముద్రించాలి. కానీ చిప్స్, ఇతర తినుబండారాల ప్యాకెట్లపై ఎప్పుడు తయారు చేశారు, గడువు ముగింపు తేదీ, తయారీ కంపెనీ చిరునామా వంటి వివరాలు కనిపించట్లేదు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో విక్రయించే ప్యాకెట్లపై కంపెనీల వివరాలు ఉండడం లేదు. క్రమం తప్పకుండా తనిఖీలు చేపట్టి కట్టడి చేయాల్సిన తూనికల, కొలతల శాఖ, ఫుడ్‌సేఫ్టీ అధికారులు సిబ్బంది కొరతతో ఏమీ చేయలేక పోతున్నారు. కావలిలో తూనికల, కొలతల శాఖకు ఒకే ఒక్క ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. ఆయన పరిధిలో కావలి రూరల్, జలదంకి, దగదర్తి, అల్లూరు, కొడవలూరు, విడవలూరు, కలిగిరి, వింజమూరు, దుత్తలూరు, ఉదయగిరి, సీతారామపురం, ఆత్మకూరు, అనుమసముద్రంపేట, కొండాపురం, బోగోలు, మర్రిపాడు, వరికుంటపాడు, సంగం, ఉలవపాడు, కందుకూరు, గుడ్లూరు, లింగసముద్రం ,ఓలేటివారిపాళెం మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో వేల సంఖ్యలో దుకాణాలు ఉన్నాయి. దీంతో పూర్తిస్థాయిలో తనిఖీలు చేయడం సాధ్యపడడం లేదు. అలాగే ఫుడ్‌సేఫ్టీ అధికారులు కేవలం జిల్లా కేంద్రంలో మాత్రమే ఉంటారు. వారు జిల్లా కేంద్రంలో తనిఖీలకే పరిమితమవుతున్నారు. దీంతో నాణ్యతా ప్రమాణాలతో నిమిత్తం లేకుండా ఎడాపెడా తినుబండారాలు మార్కెట్ ను ముంచెత్తుతున్నాయి.

తయారీ సంస్థ వివరాలు తప్పనిసరి

ఫుడ్ ప్యాకెట్‌పైన తయారీ సంస్థ పేరు, చిరునామా, డిక్లరేషన్, చరవాణి సంఖ్య తప్పనిసరిగా ఉండాలి. ప్యాకెట్లోని ఆహార పదార్థాల పరిమాణాన్ని ముద్రించాలి. తయారీ, గడువు తీరే సమయాన్ని స్పష్టంగా పేర్కొనాలి. విక్రయ ధర ఉండాలి. అనుమతి ఉంటేనే ప్యాకింగ్ చేయాలి. పాత వివరాలు తొలగించి కొత్త స్టిక్కర్లు వేయడం వంటివి చేయరాదు. ఈ వివరాలు లేకుండా ప్యాకెట్లు విక్రయిస్తున్నా, తూనికలు, కొలతల్లో తేడాలకు పాల్పడుతున్నా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

–మహమ్మద్ కరిముల్లా, ఇన్‌స్పెక్టర్, తూనికలు, కొలతల శాఖ, కావలి.

ఫిర్యాదులొస్తే తనిఖీలు చేస్తున్నాం

ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే ఆహార పదార్థాలను తనిఖీలు చేస్తుంటాం. అలాగే మాకు అనుమానం వస్తే తనిఖీలు చేస్తుంటారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం.

–జీ వెంకటేశ్వరరావు, జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్,

క్లుప్తంగా

ఎస్సైకు సేవా పురస్కారం



మర్రిపాడు: మర్రిపాడు ఎస్సై కాసుల శ్రీనివాస రావు ఉత్తమ సేవా పురస్కారాన్ని వరించింది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరులో ఎస్పీ కృష్ణకాంత్ సేవా పురస్కారాన్ని అందజేసి అభినందించారు.

భక్తవత్సలకు డాక్టరేట్



కావలి: పట్టణంలోని విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగంగా హెచ్‌ఓడీగా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆత్మకూరు భక్తవత్సలకు డాక్టరేట్ లభించింది. ఆయన హైదరాబాద్ జేఎన్‌టీయూలో ప్రొఫెసర్లు డాక్టర్ ఎస్ తారకళ్యాణి, డాక్టర్ కే అనూరాధ ఆధ్వర్యంలో విద్యుత్ వాహనాల్లో మోటారు పనితీరును మెరుగుపరిచే అంశంపై పరిశోధనలు సాగించి పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఇందుకు సంబంధించి జేఎన్‌టీయూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా భక్తవత్సలను విట్స్ చైర్మన్ దొడ్ల విద్యాధరకుమార్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ దొడ్ల ప్రత్యూషారెడ్డి, అకడమిక్ ఇన్‌చార్జి అఖిల్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎన్ శేషయ్య, వైస్‌ప్రిన్సిపల్స్ వీవీఎస్ సునీల్‌కుమార్, ఎన్ శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు అభినందించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ఆత్మకూరురూరల్: మండలంలోని బట్టేపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి తుమ్మల వంశీవర్ధన్ సోమవారం నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఇకపై ఏటా పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులకు రూ.10వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం వంశీవర్ధన్‌ను హెచ్‌ఎం పెంచలయ్య, ఉపాధ్యాయులు సత్కరించారు.

ఉపాధ్యాయిని మృతికి సంతాపం


దేవకీదేవి (ఫైల్)

కావలి: పట్టణంలోని విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాలలో గ్రేడ్-2 తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న ప్రోలవరపు దేవకీదేవి (58) గుండె పోటుతో సోమవారం మృతి చెందారు. ఆమె గాయనిగా, కవయిత్రిగా, నాటక కళాకారిణిగానూ గుర్తింపు పొందారు. ఆమె తండ్రి ప్రోలవరపు నరసయ్య తెలుగుపండిట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన కూడా పద్యనాటక రంగ ప్రముఖులు. దేవకీదేవి మృతిపై విశ్వోదయ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ద్వారకనాథ్‌చౌదరి, ఉపాధ్యాయ బృందం, విశ్రాంత హెచ్‌ఎం శారద, తదితరులు సంతాపం తెలిపారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి

దుత్తలూరు: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడిగా నర్రవాడకు చెందిన మేకపాటి మాల్యాద్రినాయుడు ఎంపికయ్యారు. ఇప్పటి వరకు ఆయన ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎంపిక చేసిన వేదిక రాష్ట్రాధ్యక్షుడు తిరుపాలు, రాష్ట్ర కార్యదర్శి ఉదయకుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా చెన్నయ్య

ఉదయగిరి: ఉదయగిరిలో బీజేపీ మండలాధ్యక్షుడి ఎన్నికను ఎన్నికల అధికారి హనుమారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోటపోతుల చెన్నయ్యను మండలాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. నాయకులు నెల్లూరు వెంకటస్వామినాయుడు, రోశయ్య, దుగ్గయ్య, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నందీశ్వరుడికి అభిషేక మహోత్సవం

సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో నందీశ్వరుడికి తొలిసారిగా అభిషేక మహోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. అనంతరం కామాక్షిదేవి, సంగమేశ్వరునికి పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు.

ఆర్థిక సాయం

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 3వ వార్డుకు చెందిన షేక్ షకీల, 5వ వార్డుకు చెందిన పాదిలి నరసింహులు, 9వ వార్డుకు చెందిన పాలంకి మంజుల, చలమల శివారెడ్డి, 19వ వార్డుకు చెందిన రాగి పెంచలమ్మ, 20వ వార్డుకు చెందిన నాగులూరి రమణయ్య, 22వ వార్డుకు చెందిన కోటకొండ రోశమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాలను సాంబశివ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి సోమవారం పరామర్శించారు. రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్ రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

1న కలయిక విజ్ఞాన కేంద్రం ప్రారంభం


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

కావలి: పట్టణంలోని రామమూర్తిపేటలోని షిర్డీ సాయి మందిరం వద్ద ఉన్న కలయిక కల్యాణ మండప ప్రాంగణంలో ప్రగతిశీల ఆశయాలతో కలయిక విజ్ఞాన కేంద్రాన్ని ఫిబ్రవరి 1న ఉదయం 10గంటలకు కావలి ఆర్డీఓ ఎం సన్నీవంశీకృష్ణ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఆ విజ్ఞాన కేంద్రం నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం కావలిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కలయిక విజ్ఞానకేంద్రంలో గ్రంథాలయం, అధ్యయన కేంద్రాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణ ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కేంద్రం కన్వీనర్లు ఇలీంద్ర లావణ్య , జీ రాంప్రసాద్, సలహాదారు సీ శారద, కార్యవర్గ సభ్యులు పార్వతీశంకర్, ఎన్ సాయిరాంప్రసాద్, ఎం చంద్రోశేఖర్, ఎస్ రామచంద్రయ్య, కే మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం


దుప్పట్లు వితరణ చేస్తున్న మాశిలామణి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం వెంకటాద్రిపాళెంలో నూతనంగా చేపడుతున్న రామాలయ నిర్మాణానికి విశ్రాంత డీఎం హెచ్‌ఓ మాశిలామణి రూ.2 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. సోమవారం ఆయన గ్రామంలోని 150 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్తులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీ సంజీవులు, డాక్టర్ ప్రశాంత్ , అశోక్, ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు రామాంజనేయులు, ఏడుకొండలు, యానాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

వయోజనులకు విద్యే లక్ష్యం

ఆత్మకూరురూరల్/సీతారామపురం: గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఉల్లాస్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం వలంటీర్లకు కిట్లను పంపిణీ చేశారు. అలాగే సీతారామపురంలోని స్త్రీశక్తి భవనంలో ఈఓపీఆర్డీ భార్గవి ఆధ్వర్యంలో ఉల్లాస్‌పై వలంటీర్లకు రెండోవిడత శిక్షణ ఇచ్చు. అనంతరం వలంటీర్లకు కిట్లు అందజేశారు.

ఈయూ నిరసన

ఆత్మకూరురూరల్: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ఏపీరెడ్డి, మల్లికార్జున మాట్లాడుతూ డీఎం కరీమున్నీసా తమ యూనియన్‌పై కక్ష సాధింపునకు పాల్పడుతూ ఉద్యోగులను ఇబ్బందులు గురిచేస్తున్నారని ఆరోపించారు. డీఎం వైఖరిలో మార్పు రాకుంటే తమ పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

టీడీపీ నాయకుడి నిరసన

ఉదయగిరి: అభివృద్ధి పనుల కేటాయింపులో టీడీపీ విజయానికి కృషి చేసిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట టీడీపీ మండల బీసీ నాయకుడు మట్ల లక్ష్మయ్య సోమవారం నిరసన తెలిపారు. పట్టణంలో జరుగుతున్న సీసీరోడ్ల పనుల్లో ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి చెందిన వ్యక్తులతో స్థానిక నేతలు లాలూచీపడి నిజమైన కార్యకర్తలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కొండాపురం : కొమ్మిలోని జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు. కొమ్మిలోని జగనన్న కాలనీని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ స్తంభాలు, మంచినీటి సౌకర్యాలను కల్పించాలని విజ్ఞప్తి చేయడంతో పరిశీలించామని తెలిపారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో సీసీరోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖల అధికారులతో చర్చించి విద్యుత్, తాగునీటి వసతులు కల్పిస్తామన్నారు. ఆయన వెంట ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ మురళి, తదితరులు ఉన్నారు.

దివ్యాంగులకు ఉపకరణాలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ షాలెట్

సంగం: వెంకటాచలంలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాలను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ షాలెట్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉపకరణాల పంపిణీ కోసం సోమవారం ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. దివ్యాంగులు, వయోవృద్ధులకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలను పరిశీలించి ఉపకరణాలకు అర్హులైన వారి వివరాలను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులకు ట్రైసైకిళ్లు, బ్యాటరీ సైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు, తదితరాలు పంపిణీ చేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యులు స్తుతిలికమిశ్ర, స్పెషల్ ఎడ్యుకేటర్ దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

గాలిపటం ఎగురవేస్తుండగా..

- విద్యుదాఘాతానికి గురై బాలుడికి గాయాలు

సంగం: గాలిపటం ఎగురవేస్తుండగా దారం తీగలపై పడి విద్యుదాఘాతానికి గురై 8 ఏళ్ల బాలుడు గాయపడిన ఘటన సంగంలోని ఎస్టీ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలు..కాలనీకి చెందిన పవన్ అనే బాలుడు గాలిపటం ఎగురవేస్తుండగా దారం 11 కేవీ విద్యుత్ తీగలపై పడింది. దీంతో బాలుడు విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. బాలుడి చెవి, చేతికి గాయాలవడంతో కుటుంబసభ్యులు నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాలుడికి ప్రాణాపాయం లేదని కుటుంబసభ్యులు తెలిపారు. కాగా విద్యుత్ ఏఈ మన్మథరావు సిబ్బందిని పంపి గాలిపటాన్ని విద్యుత్ తీగలపై నుంచి తీసివేయించారు.

తహసీల్దార్‌కు సన్మానం



అనుమసముద్రంపేట: మండల తహసీల్దార్ శ్రీరామకృష్ణను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది సోమవారం ఘనంగా సన్మానించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకోవడంపై అభినందనలు తెలిపారు. డీటీ వెంకటేశ్వర్లు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు తగవు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రసన్న కుమారిపై సర్పంచ్ దురుద్దేశపూర్వకంగా ఆరోపణలు చేసి సస్పెండ్ చేయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేడ్కర్ పేర్కొన్నారు. వింజమూరులోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్పంచ్ రెండు నెలలుగా పంచాయతీ కార్యదర్శిపై ఆరోపణలు చేస్తూ అధికారులపై ఒత్తిడి తెచ్చి సస్పెండ్ చేయించడంతో ఆమె మానసిక వేదనకు గురైనట్లుగా తెలిపారు. దళిత పంచాయతీ కార్యదర్శిపై కక్షపూరితంగా వ్యవహరించడం సరికాదన్నారు. నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సర్పంచ్ చెక్‌పవర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సింహాద్రి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఏఎస్సార్‌లో క్యాంపస్ ఎంపికలు

ఆత్మకూరు: పట్టణంలోని ఏఎస్సార్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ ఎం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం క్యాంపస్ ఎంపికలను నిర్వహించారు. బెంగుళూరు, చెన్నైలో కార్యాలయాలు కలిగిన 'ఫస్ట్ సోర్స్' కంపెనీ హెచ్‌ఆర్‌లు సుమిత్, అనిల్ డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో ప్రతిభకనబర్చిన 16 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ప్లేస్‌మెంట్ అధికారి ఏ రామ్మోహన్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఏ శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ డీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ


దుత్తలూరు: అవగాహన కల్పిస్తున్న కావలి ఆర్టీఓ సుధాకర్‌రెడ్డి


సోమశిల: అనంతసాగరంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో మానవహారం

వింజమూరు(ఉదయగిరి)/దుత్తలూరు: హెల్మెట్‌ను ధరించడం వల్ల ప్రాణాలను రక్షించుకోవచ్చని, ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్‌ను ధరించాలని కావలి ఆర్టీఓ వై సుధాకర్‌రెడ్డి సూచించారు. జాతీయ రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా వింజమూరు, దుత్తలూరులోని విశ్వతేజ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై సోమవారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగంగా, మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించి రక్షించిన వారికి రూ.5 వేలు పారితోషికం అందజేయనున్నట్లు తెలిపారు. కావలి ఎంవీఐ ఆర్ సుందరరావు, అసిస్టెంట్ ఎంవీఐ బీ లక్ష్మి, కరస్పాండెంట్ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

వరికుంటపాడు: స్థానిక పోలీసు స్టేషన్ నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు ఎస్సై రఘునాథ్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు.

సోమశిల: అనంతసాగరంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ఆర్టీఏ రాములు ఆధ్వర్యంలో స్కూళ్ల వ్యాన్లు, ఆటోలకు ఫ్లెక్సీలను కట్టి పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్మించి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి, ట్రెయినీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, ఏఎస్సై మస్తాన్, శాంతినికేతన్ స్కూల్ కరస్పాండెంట్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సంగం: సంగంలో ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ నుంచి జాతీయ రహదారి వరకు మహిళలతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు.

30 నుంచి జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలు

దుత్తలూరు: మండలంలోని నర్రవాడలోని శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాలను ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మాదాల ఎస్ బాబూరావు తెలిపారు. సోమవారం నర్రవాడలోని ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలతో కలిసి ఆయన ఉత్సవాల ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 2,3 తేదీల్లో చినజీయర్‌స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తారని వివరించారు. రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, తదితరులు హాజరవుతారని చెప్పారు.భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు అందుకోవాలని కోరారు. సర్పంచ్ నాగయ్య, గ్రామపెద్దలు మాదాల తిమ్మయ్యచౌదరి, గోగినేని రామచంద్ర, మేడపల్లి మాల్యాద్రి, రమణయ్య, తులసి, నారాయణ పాల్గొన్నారు.

పరామర్శ

వింజమూరు(ఉదయగిరి): మండలంలోని గుండెమడకలకు చెందిన ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ అంకినపల్లి ఓబుల్‌రెడ్డి సతీమణి కౌసల్యమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ నాయకులు మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, వనిపెంట సుబ్బారెడ్డి, తదితరులు ఉన్నారు.

వాహనాల తనిఖీ

సీతారామపురం: మండలంలోని పలు ప్రాంతాల్లో ఎస్సై శివకృష్ణారెడ్డి సోమవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని, సరైన పత్రాలు లేని వాహనచోదకులకు జరిమానాలు విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా, డ్రైవింగ్ లైసెన్సులు లేకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంజాయిషీ నోటీసులు

ఉదయగిరి: వెంగళరావునగర్ గ్రామ సచివాలయ సిబ్బందికి ఎంపీడీఓ అప్పాజీ సోమవారం సంజాయిషీ నోటీసులు జారీచేశారు. గణతంత్ర వేడుకలకు గైర్హాజరైన జూనియర్ లైన్‌మెన్ జీ అనిల్ కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ వీ రవికుమార్, డిజిటల్ అసిస్టెంట్ మాధవి, మహిళా పోలీసు షేక్ సత్తాజ్‌సుల్తానాకు నోటీసులు అందజేసి మూడురోజుల్లోగా సంజాయిషీ ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సంగం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కలిగిరి మండలం పాతనాపురానికి చెందిన శీనయ్య(40) అనే వ్యక్తి నెల్లూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు సంగం పోలీసులు తెలిపారు. ఈ నెల 23న శీనయ్య కొరిమెర్ల వద్ద బైక్‌పై వెళ్తూ పందిని ఢీకొని కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. అప్పట్నుంచి నెల్లూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సోమవారం పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అల్లూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇస్కపల్లి పీహెచ్‌సీ వైద్యుడు పాండురంగనాథ్ సూచించారు. మండలంలోని పురిణికొత్తపాళెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఇస్కపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యుడు పాండురంగనాథ్ 70 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఏఎన్‌ఎం మాధవి, పుష్పమ్మ, సీహెచ్‌ఓ స్రవంతి, ఆశాకార్యకర్తలు మైథిలి, శీనమ్మ పాల్గొన్నారు.